## గ్రామపంచాయతీల్లో రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

### -ఎంపిఓ ఖాజా మొహినుద్దీన్

**జగదేవ్‌పూర్, ఆగస్టు 3 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని గొల్లపల్లి, తీగుల్ గ్రామ పంచాయతీలను మండల పంచాయతీ అధికారి ఖాజా మొహినొద్దీన్ శనివారం సందర్శించి గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. తదనంతరం గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో రికార్డులను తప్పనిసరిగా ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని, జనన, మరణ, వివిధ రకాల పన్నుల రిజిష్టర్లను నమోదు చేయాలని అన్నారు. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజగోపాల్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు లేఖ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలోని అన్నపూర్ణ(అంతగిరి), రంగనాయక, మల్లన్న, కొండపోచమ్మ రిజర్వాయర్లలో నీళ్ల లేక పూర్తిగా అడుగంటి పోయే పరిస్థితికి చేరుకున్నాయని రాజకీయాలు పక్కనబెట్టి వెంటనే నీళ్ల పంపింగ్ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శనివారం భారీనీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. గత యేడాది ఆగస్టులో అనంతగిరిలో 3.32 టిఎంసిల నీళ్ల ఉంటే ప్రస్తుతం 0.75 టిఎంసిలు, రంగనాయకసాగర్‌లో 2.38 టిఎంసిలకు గానూ ప్రస్తుతం 0.67 టిఎంసిలు, మల్లన్న సాగర్‌లో 18 టిఎంసిలకు గానూ ప్రస్తుతం 8.5 టిఎంసిలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టిఎంసిలకు గానూ ప్రస్తుతం 4.5 టిఎంసిల నీళ్ల మాత్రమే ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్లలో నీళ్ల లేక మరో వైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర అందోళనలో ఉన్నారని తెలిపారు. పంటలు వేయాలా వద్దా అనే అయోమయంలో రైతులు అవేదన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత యేడాది కంటే ఈ యేడు జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి మిడ్ మానేర్ నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్,రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే అదేశాలు జారీ చేయాలని కోరారు. రిజర్వాయర్ల నింపి కాలువల ద్వారా అయకట్టుకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం

**-ఈ నెల 5 నుండి 9వ తేదీ వరకు జిల్లాలో కార్యక్రమాలు**
**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు3 ప్రభాతవార్త:**
పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛధనం.. పచ్ఛధనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ నెల 5 నుండి 9వ తేదీ వరకు రోజు వారిగా చేయాల్సిన పనుల ప్రణాళికను విడుదల చేసిందని, వార్డు, గ్రామ పంచాయితీ టీమ్ సభ్యులు రోజు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ నివేదించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఈ నెల 5వ తేదీన స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ర్యాలీ తీయాలని, ప్రచార చిత్రాల ద్వారా వీధి కుక్కల బెడద, ఇంటి స్థాయిలో చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తోటల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం దుష్పరిణామాలపై ప్రసంగం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయాలన్నారు. మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి వారికి 15 రోజుల్లో నూతనగా అనుమతులు ఇచ్చి పూర్తి చేయించాలన్నారు. రెండవ రోజు ఈ నెల 6వ తేదీన అన్ని త్రాగునీటి వనరులను శుభ్రం చేయాలని, రోజూ క్లోరినేషన్ చేసి నీటిని మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని, క్లోరినేషన్ స్థాయిలు క్లోరో స్కోప్‌లు కిట్స్ ద్వారా టెస్ట్ చేయాలని ఆదేశించారు. 300 చదరపు గజాల విస్తీర్ణం గల భవనాలను గుర్తించి యజమానులకు వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ద్వారా నీటి నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. మూడవ రోజు ఈ నెల 7వ తేదీన మురికి కాలువల్లో పూడికి తీయించాలని, లోతట్టు ప్రాంతాలు, నీటి నిల్వ గల ప్రదేశాలను గుర్తించి మొరం నింపాలని, నీటి నిల్వ గల ప్రదేశాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్స్ లేదా ఇంకుడు గుంతలు నిర్మాంచాలన్నారు. నాలుగవ రోజు ఈ నెల 8వ తేదీన మహిళా సంఘాల బాధ్యులు, ఆశాలు పాఠశాల సమావేశాల్లో డెంగ్యు, మలేరియాపై అవగాహన కల్పించాలని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు గ్రామ పంచాయితీలు, పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని సర్వేలు నిర్వహించాలన్నారు. ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీలార్వల్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని, పట్టణ స్థానిక సంస్థల్లో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయితీ కార్యదర్శులు పశుసంవర్ధక శాఖ వారి సమన్వయంతో వీధి కుక్కల సర్వే నిర్వహించాలన్నారు. ఆఖరి రోజు ఈ నెల 9వ తేదీన పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్స్, పబ్లిక్ స్థలాలను శుభ్రం చేయాలని, ప్రతి శుక్రవారం గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని గృహాలను సందర్శించి ఆవరణలో ఉన్న అన్ని నీటి నిల్వలను తొలగించాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయితీ, పట్టణ స్థానిక సంస్థల్లో ఉన్న శిథిలమైన భవనాలు, గోడలు తొలగించాలని, రోడ్డు ప్రక్కన కుళ్లిపోతున్న చెట్లు, వాటి కొమ్ములను తొలగించాలన్నారు. స్థలాలను గుర్తించి మొక్కలను నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి కనీసం 6 మొక్కలను పంపిణీ చేయాలని, పల్లె ప్రకృతి వనాలు, పార్క్‌లను శుభ్రం చేయించాలన్నారు. గ్రామ పంచాయితీ, పట్టణ స్థానిక సంస్థల్లో పరిశుభ్ర, పచ్చదనం కొనసాగించడానికి నిరంతర ప్రాతిపదికన కార్యకలాపాలు నిర్వహించాలని, ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛధనం.. పచ్ఛధనం రోజుగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమీషనర్లు, జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవో, డీఎల్పీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాల అమలుపై తమ నివేదికలను రోజు వారిగా సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛధనం.. పచ్ఛధనం కార్యక్రమంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

## గంజాయి,డ్రగ్స్ మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేయాలి : సిపి



త్రీ టౌన్ పోలీసు స్టేషన్ అవరణలో మొక్కలు నాటుతున్న సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేసి సమూలంగా నిర్మూలించాలని సీపీ డా॥ అనురాధ అదేశించారు. జిల్లా కేంద్రంలోనిన త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే దరఖాస్తు చేసే ప్రతి ఒక్కరికి రశీదు ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలు అమ్మే వారిపై సేవించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో,పట్టణాలలో బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను మంచ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐలు కొమురయ్య, చంద్రయ్య, నరేందర్, ఎఎస్ఐలు శ్రీనివాస్, ముజీబ్, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రీజినల్ రింగ్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు

**నర్సాపూర్ అగస్టు 3. ప్రభాతవార్త :**
రీజినల్ రింగ్ రోడ్డు సర్వేరోసం వచ్చిన అధికారులను మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ రైతులు అడ్డుకున్నారు. శనివారం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గాను సర్వే చేయడానికి అధికారులు రెడ్డిపల్లి గ్రామ శివారులోకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రీజినల్ రింగ్ రోడ్డులో భూముల కోల్పోతున్న గ్రామ రైతులువచ్చి ఇప్పటికే పలుమార్లు తమ భూములు కోల్పోయామని అన్నారు. కాగా ప్రస్తుతం భూమికి బదులుగా భూమి ఇవ్వాలని అధికారులను కోరారు. మాకు ఖచ్చితమైన హామీ ఇచ్చేంత వరకు సర్వే చేయడానికి వీలు లేదని అధికారులకు ఎప్పారు. ఈ సందర్భంగా రైతులు అక్కడే కూర్చుని దర్నా నిర్వహించారు. ఈ మేరకు సర్వే చేయడానికి వచ్చిన అధికారులు ఆర్డీవో జగదీశ్వరరెడ్డి, సిఐ జాన్‌రెడ్డి ,తహాశీల్దార్ కమలాద్రి, సర్వేయర్ మొగులయ్య లను సర్వే చేయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రీజినల్‌రింగ్ రోడ్డు నియోజకవర్గంలో సుమారు 17 గ్రామాల నుండి వెళ్తుండగా ఆ గ్రామాల్లోని రైతుల సహకారంతో సర్వే పూర్తి చేశామన్నారు. కాగా ఈ రెడ్డిపల్లి గ్రామంలో సర్వే మిగిలిపోయిందని తెలిపారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం తగిన నష్ట పరిహారం చెల్లిస్తారని పేర్కొంటు ఈవిషయంలో తాము ఏమి చేయలేమని ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని తెలిపారు. ఈమేరకు అధికారులు రైతులకు ఎంత నచ్చజెప్పిన రైతులు వినకపోడంతో సర్వే చేయకుండానే నిలిపివేసి మరొక రోజు ఈ సర్వే నే చేస్తామనిఅధికారులు వెనుదిరిగి పోయారు. ఈ కార్యక్రమంలో భూములు కోల్పోతున్నరైతులు రవిందర్‌గౌడ్, భూమాగౌడ్, వెంకటేశ్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, ఏర్ల శేఖయ్య, సత్యనారాయణగౌడ్ తదితరులుపాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో రీజినల్ రింగ్ రోడ్డు సర్వేను అడ్డుకొని అక్కడే ధర్నా చేస్తున్న రెడ్డిపల్లి గ్రామ రైతులు

## మహిళా సాధికారితకు పభుత్వాలు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

**-మహిళలకు చట్టాలు రూపొందించే సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**
**-మహిళలు మాతృమూర్తులే కాదు..**
**సాక్షాత్ బిడ్డకు జన్మనిచ్చే శక్తిస్వరూపులు**
**-జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి**





మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి

**గుమ్మడిదల, ఆగస్టు3 ప్రభాతవార్త:**
మహిళా సాధికారిత మరింత పటిష్టతకు ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలని, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు చట్టాలను రూపొందించే అత్యున్నత సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలు మాతృమూర్తులే కాదు.. సాక్షాత్ బిడ్డకు జన్మనిచ్చే శక్తిస్వరూపులని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి అన్నారు. శనివారం మిషన్ శక్తి వంద రోజుల అవగాహన కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల స్పెషల్ కార్యనరకమంలో భాగంగా గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారితో పాటు డీఎల్పీవో అమృత, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహశీల్దార్ గంగాభవాని, ఎస్ఐ మహేశ్వరరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలు అంటే అబల కాదు.. సబల అని, మహిళల పట్ల చిన్నచూపు చూడరాదని, మహిళలు దేనిలో కూడా తక్కువ కాదని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ అమ్మయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత పెళ్లి చేయాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించినప్పటికీ అక్కడక్కన అనివార్య కారణాల వల్ల అనుకోని ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, అటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా మహిళలకు అత్యున్నత చట్ట సభల్లో చట్టాలు రూపొందించే అవకాశం కల్పించాలన్నారు. మహిళలంటే కేవలం పిల్లలు కనే యంత్రాలు కాదని, మహిళలను పురుషులతో సమానంగా చూడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ పుడితే ఒక రకంగా, మగబిడ్డ పుడితే మరో రకంగా చూసే తల్లదండ్రులకు ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలంతా అవగాహన కల్పించాలని సూచించారు.

**తల్లిపాల వారోత్సవాలు...**
తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతేవేదికలో మహిళా సాధికారిత అవగాహన సదస్సు కార్యనరకమంలో మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు నూతనంగా వచ్చిన పటాన్‌చెరు ప్రాజెక్టు అధికారి సీడీపీవో జైరామ్ నాయక్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, అంగన్వాడీ సూపర్‌వైజర్ కవిత, మండలంలోని 13 పంచాయితీల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు హాజరై మహిళలకు తల్లిపాలు పిల్లలు పుట్టిన గంట సేపటికి ముర్రుపాలను అందించడంతో పౌష్టిక, రోగనిరోధక శక్తి కలిగినటువంటి పాల గురించి మహిళా మాతృమూర్తులకు సవివరంగా వివరించారు. పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప వేరే ఎలాంటి డబ్బా పాలను వాడరాదని సూచించారు. అనంతరం వివిధ గ్రామాల చిన్నారులకు బాలామృతంతో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శివకుమార్, డిస్టిక్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ గడ్డం పల్లవి, ఎంపీవో దయాకర్‌రావు, మండల సమైఖ్య సంఘాల అ ధ్యక్షురాలు అనురాధ, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, వివిధ గ్రామాల మహిళా సంఘాల నాయకులు, మహిళలు, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక గిరిజన రైతు ఆత్మహత్య

**పుల్కల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని లక్ష్మీసాగర్ పంచాయతి పరిధిలోని ఉమ్లానాయక్ తండాలో శనివారం చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ కథనం ప్రకారం... ఉమ్లానాయక్ తండాకు చెందిన నెనావత్ బాల్‌సింగ్ (41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. వ్యవసాయ పెట్టుబడుల కొరకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక శనివారం తెల్లవారు జాము ఇంట్లో పురుగుల మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. విషయం గ్రహించిన కుటుంబ సభ్యులు 108లో బాల్‌సింగ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు. మృతుడికి భార్య శాంతిబాయి, నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చౌటకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త:** కాలినడకన రోడ్డు దాటతున్న వ్యక్తిని అతివేగంగా వచ్చిన వాహనం ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జాము చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న క్రమంలో అటుగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని బలంగా ఢీకొనడంతో పాటు100 మీటర్ల దూరం వరకు రోడ్డుపై లాగేసుకుంటూ వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు పట్టేలా లేకుండా శవం ముద్దలా మారిపోయింది. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది సమాచాం మేరకు పుల్కల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు హైవేపై ఉన్న సిసి కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పుల్కల్ ఎస్ఐ వివరించారు.

## జూదం ఆడుతున్న 7గురుపై కేసు నమోదు

**సిర్గాపూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** శనివారం మిట్టమధ్యాహ్నం మండల పరిధిలోని బొకస్గాం గ్రామంలో ఉపాసే వైద్యనాథ్ గృహంలో పేకాట ఆడుతున్న 7 గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామంలో జూదం ఆడుతున్నారని తెలుసుకున్న సిర్గాపూర్ ఎస్ఐ తన సిబ్బందితో జూద గృహంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. జూదం ఆడుతున్న పాటిల్ శ్రీనివాస్, నిజాముద్దీన్, ఆసం పండరి, కంగ్టి మారుతి, నాయకుని నింగయ్య, నాయకుని రవి కుమార్, పాటిల్ జ్ఞానోభారావులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5420 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు. పేకాట ఆడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## లాడ్జిలలో పోలీసుల ఆకస్మిక తనిఖీ

**గజ్వేల్, ఆగస్టు 3 (ప్రభాతవార్త):**
సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గజ్వేల్ సిఐ సైదా శనివారం సిబ్బందితో కలిసి గజ్వేల్ పట్టణంలో ఉన్న లాడ్జిలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాడ్జిలలో లాగ్ బుక్కులలో ఎవరెవరు వచ్చారు, ఎప్పుడు వచ్చారు, ఎక్కడి నుంచి వచ్చారు తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం సిఐ సైదా మాట్లాడుతూ లాడ్జిలలో తప్పకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సిసి కెమెరాలను ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లాగ్ బుక్కులలో రాసిన వివరాలను ప్రతిరోజు పోలీస్‌స్టేషన్‌కు పంపించాలని తెలిపారు. లాడ్జికి వచ్చే ప్రతి ఒక్కరి దగ్గర ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోవాలని సూచించారు. లాడ్జిలలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, జూదం, వ్యభిచారం తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత లాడ్జిల నిర్వాహకులపై ఉంటుందన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : డిఈఓ వెంకటేశ్వర్లు



కంగ్టి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

**కంగ్టి , ఆగస్టు 3 ప్రభాతవార్త:** విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీఈఓ ఎస్.వేంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కంగ్టి కస్తూర్బా పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కంగ్టి కాంప్లెక్స్ పాఠశాల సమావేశంలో డీఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సరైన పాఠాలు బోధించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. నెషనల్ అచ్యువ్‌మెంట్ సర్వేలో భాగంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అనంతరం కంగ్టి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు బోధన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా స్టోర్ రూమ్‌ను కూడా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి కస్తూర్బా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యం : సిఐ దుర్గ



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యంన

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**
నవ మాసాలు మోసి బిడ్డను కనిపెంచడంలో తల్లి పాత్ర చాలా కీలకమైందని సిద్దిపేట మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని సురభి వైద్య కళాశాలలో అనుబంధ కళాశాల సురభి నర్సింగ్ కళాశాల విద్యార్థులచే బిజెఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండు వరకు నర్సింగ్ కళాశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి యేడాది ఆగస్టులో 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారని తెలిపారు. తల్లిపాలల్లో మహత్తర శక్తి ఉందని పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం చాలా అవసరమన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బతాయి, వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ డా॥సాయి తదితరులు మాట్లాడుతూ 6 నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. కాగా సాంస్కృతిక అవగాహన కార్యక్రమం-1 టౌన్ సీఐ లక్ష్మీబాయి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో డా॥ ప్రవీణ్‌కుమార్, సీఏఓ రామకృష్ణ, ఏఓ అమృత్‌పాల్‌సింగ్, పిఆర్ఓ పర్శరాములు, రాజేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణామాఫీ చేయాలి

**-మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణామాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రైతులకు ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. గత 15 రోజుల నుంచి రైతులకు రుణమాఫీ లక్ష వరకు, రూ.1.50 లక్షల వరకు మాఫీ చేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా చాలా మందికి రుణమాఫీ రాలేదని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రైతుకు రుణమాఫీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సంబురాలు జరుపుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా భూములు ఉన్న వారికి రుణమాఫీ వర్తించడం లేదని, రేషన్‌కార్డులను జోడించడం సరికాదని అన్నారు. రుణమాఫీ కాని వారికి పెట్టుబడి సాయం కింద రైతులకు రుణాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్, నారాయణఖేడ్ మండల తాజా మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, నారాయణఖేడ్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు నిజాంపేట తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌చారి, నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ నజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమిల్, నారాయణఖేడ్ పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు నగేష్, నాయకులు అభిషేక్ శెట్కార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**-మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితవెంకన్న

**హుస్నాబాద్, ఆగస్టు3, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు హుస్నాబాద్ మున్సిపాలిటీలో చేపట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించబోయో కార్యక్రమంపై పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5నుండి 9తేదీల వరకు ప్రతీ వార్డులో పారిశుధ్యం, సీజనల్ వ్యాదులు, త్రాగునీటితో పాటు నిల్వ ఉండే నీరు, ఇంకుడు గుంతల నిర్మాణం, రోడ్లపై గుంతలు, వీధి కుక్కలు, మొక్కలు నాటడం వంటి అంశాలపై వార్డు ఆఫీసర్లు, మెప్మ రిసోర్స్ పర్సన్స్ అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, కౌనిలర్లు కొంకటి నళినిరవి, బోజు రమాదేవి రవిందర్, స్వర్ణలత, పద్మ, సరోజన, హరీష్, శ్రీలత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్ఛధనం కార్యక్రమంలో మండలాన్ని పరిశుభ్రంగా తయారు చేసుకోవాలని అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ అధికారి బానోతు జయరాంనాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న సమస్యలన్ని ఈ కార్యక్రమం ద్వార పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు ఉన్నారు.

## పదేళ్ల పాలనలో నిరుద్యోగుల జీవితాలతో బిఆర్ఎస్ చెలగాటం : జెఏసి చైర్మన్ శ్రీహరి



స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకుంటున్న చైర్మన్ భట్టు శ్రీహరి తదితరులు

**తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త:** దేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని జేఏసీ చైర్మన్ బట్టు శ్రీహరి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో జాబ్ కేలండర్ ప్రవేశపెట్టడం పట్ల టీజేఏసీ,టీఎస్ జేఏసీ చైర్మన్ బట్టు శ్రీహరి హర్ష వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ.యూ కళాశాల వద్ద జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి ఆద్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు జాబ్ కేలండర్ విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ మాట నిలబెట్టుకుందన్నారు. పేపర్ లీకేజీలు, విధ్యార్థి వ్యతిరేక కార్యకలాపాల కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను తమ కల్వకుంట్ల కమిషన్‌గా మార్చుకొని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మాట మీద నిలబడి వాగ్దానాలు నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడేటప్పుడు బిఆర్ఎస్ నాయకులు ఒళ్లుదగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకొండ సుభాష్ రెడ్డి, రవీందర్ నాయక్, లక్‌పతి నాయక్, నరేందర్, రాజేష్ తధితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టాలి

**హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయా లని బిజెపి ఎస్సీమోర్చ రాష్ట్ర పదాధికా రులు, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్ణ యించింది. శనివారం బర్కత్‌పుంలోని బిజెపి నగర కార్యాలయంలో ఎస్సీమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర ప్రభారి డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ఎస్సీస్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌లో సుమారు రూ.3,500 కోట్లు కోత విధించడం జరిగిందని, ఎన్నికలకుముందు ఎస్సీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు (అంబేద్కర్ అభయహస్తం, ఎస్సీకార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పున: నిర్మాణం తదితర అంశాలు' ఎటువంటి కేటాయింపులు జరగలేదని సమావేశం ఆవేదన వ్యక్తంచేసింది. రాబోయే రోజుల్లోకాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భవిష్యత్తుకార్యక్రమాలపై చర్చించి నిర్ణయించాలని తీర్మాణించింది.ఆగస్టు 5,6,7 తేదీల్లో ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులుచేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన, ఆగస్టు 17న కాంగ్రెస్ పార్టీ చేవేళ్ళ ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయిం చడంలో విఫలమైనందుకు చేవేళ్ళలో ఎస్సీమోర్చ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టాలని నిర్ణయించింది.

## నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**అత్తాపూర్ ఆగస్టు3,ప్రభాతవార్త :** నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులును కేటాయించాలని కోరుతూ శనివారం సచివాలయంలో వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వర రావును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిసి వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నియో జకవర్గంలోని పలు అభివృద్ధి పనుల కు ప్రత్యేక నిధులను కేటాయించామ ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కోరడం జరిగిందని తెలిపారు.మంత్రి సానూకులంగా స్పందించి తప్పకుండా నిధులు మంజూరుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కాంట్రాక్టర్లతో జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి చర్చలు

**-బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని చెప్పడంతో ఆందోళన విరమణ**

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:**

పెండింగ్‌లో బకాయిలను చెల్లించాలంటూ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట బల్దియాకాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. వివిద అభివృద్ధి పనులకోసం రావాల్సిన 1500కోట్ల మేర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాజాగా శనివారం వారితో జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి చర్చలు జరిపారు. చర్చల అనంతరం తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్న కాంట్రాక్టర్లు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న రూ.1500కోట్ల బిల్లులను దశవారీగా చెల్లిస్తామని అమ్రపాలి వారికి హామీ ఇచ్చారు. కాగా ఈనెల 5వ తేదీలోగా బకాయిలను చెల్లించకుంటే జిహెచ్ఎంసి కాంట్రాక్టర్ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించడంతో అమ్రపాలి రంగంలోకి దిగి కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు.

## ఓ.యూ ఇంజనీరింగ్ కళాశాల అకాడమిక్ అవార్డుల ప్రధానోత్సవం

**-విద్యార్థులకు ఆవార్డులను అందజేసిన సింగరేణి ఎండి.బలరాం నాయక్**



**తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ ఇంజ నీరింగ్ కళాశాల అకాడమిక్ అవార్డుల ప్రధానోత్సవం శనివారం ఎంతో సందడిగా జరిగింది. ఈవేడుకకు ముఖ్య అతిథిలుగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక తను ఆలవర్చుకొని ముందుకు సాగాలని సూచించారు. యువకులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆవార్డుల ప్రధానోత్సవం సందర్భంగా వివిద రంగాల్లో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన కళాశాల పూర్వ విధ్యా ర్థిని ఎంపికజేసి విశిష్ట పూర్వ విద్యార్థి పూరస్కారాన్ని అమెరికాకు చెందిన కృష్ణ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వ్యవస్థాపకులు గోపాల టికె. కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు ఘనం గా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, ప్రొ.పి. చంద్రశేఖర్‌తో కలసి విద్యార్థులకు ఆవార్డులు, సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రొ.నర్సింహులు, పూర్వ విద్యార్థుల అధ్యాపకులు డా. దేవరకొండ విజయ్ కుమార్, ప్రొ. కృష్ణయ్య,కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు పాల్గొన్నారు.

# వణికిస్తున్న డెంగీ



**-జిహెచ్ఎంసి, శివారు మున్సిపాలిటీల్లో టైగర్ దోమల స్వైరవిహారం**

**-పగటిపూట కుట్టే ఆ దోమలతో వ్యాపిస్తున్న జ్వరాలు**

**హైదరాబాద్,ఆగస్టు 3, భాతవార్త**

జిహెచ్ఎంసిలో ఎంటమాలజీ విభాగంలో 2,500 మంది సిబ్బంది ఉన్నారు. అదనపు, జోనల్, డిప్యూటీ, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, ఏఎంఒహెచ్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కమిషనర్ ఆదేశించినా పట్టించుకునే వారు కరువయ్యారు. రసాయనాలు, యంత్రాలు, సిబ్బంది వేతనాల కోసం ఏటా రూ.15 కోట్లు ఎంటమాలజీ విభాగం ఖర్చు చేస్తోంది. అయినా నెల రోజుల్లో డెంగీ కేసుల సంఖ్య మూడింతలు పెరిగింది. అనధికారికంగా ఈ సంఖ్య మూడు, నాలుగింతలు అధికంగా ఉంటుంది.

విపరీతమైన జ్వరం. ఒళ్లునొప్పులు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం.. అడుగు తీసి అడుగు వేయలేనంతగా కీళ్లనొప్పులు!! రాష్ట్రంలో ఈ తరహా లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. వారికి పరీక్షలు చేయిస్తే.. చాలామందిలో డెంగీ, చికున్‌గున్యా నిర్ధారణ అవుతోంది. వారిలో కొంతమందిని ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స చేయాల్సి వస్తోందని వేద్యులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు 103-104 డిగ్రీల జ్వరంతో వస్తున్న ఔట్‌పేషెంట్లలో.. 90శాతం కేసులు డెంగీ, చికున్‌గున్యావే అయి ఉంటున్నాయని వారు వెల్లడిస్తున్నారు. వారిలోనూ డెంగూయ బాధితులే ఎక్కువగా ఉంటున్నారని.. మూడోవంతు కేసులు చికున్‌గున్యావి ఉంటున్నాయని వైద్యులు వివరించారు. అలాగే.. నిత్యం ఓపీకి వస్తున వారిలో కనీసం ఐదోవంతూ ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితి ఉంటోందని తెలిపారు. ఫీవర్ ఆస్పత్రిలో రోజూ 650కి పైగా ఓపీ కేసులు వస్తుండగా, అందులో 10 దాకా డెంగ్యూ లక్షణాలు ఉన్నవారేనని సమాచారం. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆస్పత్రిలో కూడా చాలా మంది డెంగ్యూ లక్షణాలతో వస్తున్నట్లు తెలుస్తోంది.

డెంగీ, చికున్‌గున్యా వ్యాపికి ఎడెస్ ఈజీప్టె అనే దోమ ముఖ్య కారణం. కానీ.. భారతదేశంలో దాని తర్వాత ఆ రెండు జ్వరాల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్న మరో రకం దోమ ఎడెస్ ఆల్బోఫిక్టస్ అలియాస్ టైగర్ దోమ. ఇప్పుడు ఈ దోమలు రాష్ట్రవ్యాప్తంగా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ దోమలపై పులుల మాదిరిగా చారికలు ఉండడంతో వీటికి ఆ పేరు వచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుండడంతో దీన్ని అర్బన్ మస్కిటోగా కూడా పిలుస్తారని వైద్యులు తెలిపారు. డెంగ్యూ రోగిని కుట్టిన టైగర్ దోమ ఆ తర్వాత ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతనికి కూడా డెంగీ వచ్చే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట నిద్రపోయేటప్పుడు దోమల కుడతాయనే భయంతో తెరలు, కాయిల్స్, దోమలు కుట్టకుండా ఒంటిపై రాసుకునే లేపనాలను వాడుతాం. కానీ ఈ టైగర్ దోమలు పగటిపూట కుడతాయని చీకటిపడ్డాక వీటి జాడ ఉండదని వైద్యులు చెబుతున్నారు.

టైగర్ దోమలు ఇంటి పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. మురుగు నీరు ఉండే చోట తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. ఉదాహరణకు ఎయిర్ కూలర్‌లో నిల్వ ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, ఆక్వేరియం, పగిలిన సీసాలు, కుండపెంకుల్లో, వర్షపునీరు పడి నిలిచే చోట, మూతలులేని ట్యాంకుల్లో నివాసం ఏర్పరచుకుని అక్కడే గుడ్లు పెడుతూ తన సంతతిని పెంచుకుంటుంది. ఈ దోమలు రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించడం వల్ల చాలా మంది డెంగీ, చికున్‌గున్యా వంటివాటిబారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. కాబట్టి పగటిపూట కుట్టే ఈ దోమల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టుపక్కల ఎక్కడా నిల్వ నీరు, మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇటీవలికాలంలో చాలామంది 103-104 జ్వరం, నీళ్ల విరేచనాలు, ఒళ్లు కీళ్ల నొప్పుల వంటి లక్షణాలతో అస్పత్రికి వస్తున్నారు. అది సాధారణ వైరల్ ఫీవర్ అయితే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. కానీ చాలా మంది జ్వరం రాగానే డెంగీ, చికున్‌గున్యా పరీక్షలు చేయించుకుంటున్నారు. కానీ.. అలా వెంటనే టెస్టులు చేయించుకోవడం వలన్ల ఉపయోగం లేదు. జ్వరం వచ్చిన ఐదురోజులకు శరీరంలో యాంటీబాడీస్ తయారవుతాయి. అప్పుడు పరీక్ష చేయిస్తే ఒకవేళ ఆ యాంటిబాడీస్ ఉంటే పాజిటివ్ వస్తుంది. ముందే పరీక్ష చేయిస్తే నెగిటివ్ వస్తుంది. దీంతో డెంగ్యూ లేదని భావించి నర్లక్ష్యంగా ఉంటారు. అదిసరికాదు అలాగే.. లక్షణాలు కనిపించిన అయిదు రోజుల వరకు యాంటిబయాటిక్ మందులు ఇవ్వకూడదు. లక్షణాలను బట్టి పారాసెటమాల్, ఫ్లూయిడ్స్ వంటివి ఇవ్వాలి. ఐదురోజుల తర్వాత టెస్ట్ చేయించి అది ఏ జ్వరమో నిర్ధారించుకోవాలి. డెంగీ వస్తే 6వ రోజుల నుంచి ప్లేట్‌లెట్స్ తగ్గడం మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య 20 నుంచి 30వేల లోపునకు పడిపోతే అదనంగా ఇవ్వాల్సి ఉంటుంది.

## తహసీల్దార్ ఆఫీసుకు వచ్చే ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి

**-మీ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, భవనాలను గుర్తించండి**

**-ఆర్డీవో, ఎమ్మార్వోల సమీక్షా సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:**

సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాలు వచ్చే ప్రతి దరఖాస్తును వచ్చినవి వచ్చినట్లే పరిష్కారం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ,వివిధ సెక్షన్స్ పర్యవేక్షకులతో నిర్వహించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని వివిధ అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతిదరఖాస్తును ఇన్‌వార్డులో తేదీవారీగా నమోదు చేసి అదేరోజు సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని, సంబంధిత సెక్షన్లకు వచ్చిన దరఖాస్తులను వచ్చినవి వచ్చినట్లు పరిష్కారం కావాలని అదేశించారు. ప్రజాపాలన సేవాల కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, గ్యాస్, ఎలక్ట్రిసిటీ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. సిఎంవో, ప్రజావాణి , మీసేవ దరఖాస్తులన్నీ వెనువెంటనే పరిష్కారం చేయాలని, మీసేవా డాష్‌బోర్డులో పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. అక్రమణకు గురైన ప్రభుత్వ భవనాలు, భూములను గుర్తించాలని అధికారులకు సూచించారు. అలాగే కళ్యాణలక్ష్మీ , షాదీముబారక్ దరఖాస్తులను యుద్ధ ప్రతిపదికన పరిష్కారం చేయాలన్నారు.ఈసమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వెంకటచారి తదితరులు

## నిమ్స్‌లో దొంగల బెడద..

**-సెల్ ఫోన్ చోరీ సీసీ కెమేరాలో రికార్డు**

**-తరచు సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోని సెక్యూరిటీ సిబ్బంది**

**పంజగుట్ట, ఆగస్టు 3 (ప్రభాతవార్త):**

నిమ్స్ ఆసుపత్రికి రోగులు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని తమకు వచ్చిన వ్యాధి నయం చేసుకోవడానికి ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. రోగులు వారి హడావుడిలో వారు ఉండగా దొంగలు సందట్లో సడేమియా చందంగా తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఓపీ కౌంటర్‌ల వద్ద, రద్దీగా ఉండే రోగుల వద్ద కొంతమంది దొంగలు చేరి తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిమ్స్ ఓపీ విభాగంలో నెఫ్రాలజీ పేషెంట్ ఒకరు ఓపీ కౌంటర్‌లో తన పేరు నమోదు చేయించుకునే హడావుడిలో ఉండగా ఓ దొంగ తన చేతి వాటం ప్రదర్శించి పేషంట్ వద్ద ఉన్న ఐ ఫోన్‌ను దొంగిలించాడు.ఈ దృశ్యం సీసీ కెమెరాలో రికార్డు అయింది. పేషంట్ నిమ్స్ సెక్యూరిటీ అధికారులను సంప్రదించగా సీసీ కెమెరా రికార్డులనుపరిశీలించడంతో దొంగతనం చేసిన వ్యక్తి ఫోటో క్లియర్‌గా రికార్డు అయింది.దీంతో ఈ విషయమై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శ్రీప్రసన్న మహంకాళి దేవాలయం ఎదురుగా ఉన్న మారుతి హోమ్స్‌లో ఆర్టీసీ పికెట్ డిపోలో పనిచేసే రవీందర్ కూతురు లాలస చందన(18) అనే విద్యార్థిని వరంగల్ ఎన్ఐటి సీట్ కోసం ప్రయత్నిస్తోంది. కాగా శనివారం ఇంట్లోని గదిలో లాలస చందన తలుపులు వేసుకొని చాలాసేపటి నుంచి బయటకు రాలేదు. తల్లి చాలాసార్లు తలుపు కొట్టిన ఎటువంటి స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్ళింది. లోపట లాలస ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం కనబడింది. వెంటనే ఆమె 100 నెంబరుకు డయల్ చేసి సమాచారం అందించింది. సమాచారం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## పాతకక్షలతో కార్మికుడిని హత్యచేశారని అనుమానాలు

**-జీడిమెట్ల దేవేందర్‌నగర్‌లో ముస్తఫా దారుణహత్య**

**-తనను జైలుకు పంపించాడనే కోపంతో హత్యకు పాల్పడినట్లు అనుమానం**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 ప్రభాతవార్త**

ఇద్దరు కార్మికుల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరు జైలుజీవితం అనుభవించగా అదిమనసులో పెట్టుకుని నాలుగు నెలల తరువాత హత్యచేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంనుండి 20ఏళ్లక్రితం నగరానికి వచ్చిన ముస్తఫా(38) గాజులరామారం దేవేందర్‌నగర్‌లో నివాసముంటూ రోజుకూలీ చేసుకుంటుండేవాడు. స్థానికంగా జేబుదొంగగా మారిన ముస్తఫాను పలుమార్లు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.అయితే శనివారం ముస్తఫా దారుణహత్యకు గురయ్యాడు. నగర శివారుజీడిమెట్ల పారిశ్రామికవాడలో దినసరి కూలీగా పనిచేస్తూ ఆయా కంపెనీల సమీపంలోనే నడుపుతుండే ముస్తఫాకు పదిహేనేళ్లక్రితం వివాహమై బార్యభర్తలమధ్య తలెత్తిన ఘర్షనలతో విడిపోయారు. స్థానికంగా నివసించే గౌస్ అనే కార్మికుడితో ముస్తఫాకు తరచూ ఘర్షనచోటుచేసుకుంటుండేది.2019లో వీరిద్దరి మధ్య తలెత్తిన ఘర్షణతో కేసు నమోదుకావడంతోపాటు గౌస్‌కు జైలుశిక్ష పడింది. దీనితో అప్పట్లో గౌస్ జైలుజీవితం గడిపి నాలుగు నెలలక్రితం విడుదలైవచ్చాడు. తిరిగి వచ్చిన తరువాత సైతం వీరిద్దరిమధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకోవడం ఇదేతరుణంలో ముస్తఫా శనివారం హత్యకు గురైయ్యాడు. ఈ సమాచారం ముస్తఫా సోదరుడు తమస్సూర్ అలీ ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించిన పోలీసులకు ముస్తఫా గత చరిత్ర పరిశీలించగా గౌస్‌ను జైలుకు పంపిన విషయం బయటపడింది. అయితే హత్య గౌస్ చేశాడా లేదా అనేది బయటపడలేదు. ముస్తఫా హత్యకుగురి కావడంతో ఈపని గౌస్ చేసి వుంటాడనేకోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

## పాతబస్తీలో అక్రమ రేషన్ బియ్యం, గోధుములు పట్టివేత

**-అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్**

**చార్మినార్,ఆగస్టు 3 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీలో అక్రమంగా రేషన్ బియ్యంతో పాటు గోధుములు నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న గ్యాంగ్‌ను సౌత్ జోన్ టాస్క్ ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పాతబస్తీలోని రెండు చోట్ల దాడులు నిర్వహించి ముగ్గరిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 102 క్వింటాల రేషన్ బియ్యం,31 క్వింటాల గోధుమలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కధనం ప్రకారం....పాతబస్తీ నషేమాన్ నగర్‌కు చెందిన షేక్ రషీద్, షేక్ అయాజ్ తండ్రి కొడుకులు ఆమాన్‌నగర్‌కు చెందిన షేక్ సాబేర్‌తో పాటు మరో కొంత మందితో కలిసి రేషన్ బియ్యాన్ని కేజి 12 రూపాయలకు కొనుగోలు చేసి 20 రూపాయలు కేజి చొప్పున విక్రయిస్తున్నారు.సమాచారం అందుకున్న సౌత్ జోన్ టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర,భవానీ నగర్ పోలీసులు,సివిల్ సప్లయి అధికారులు కలిసి దాడులు నిర్వహించారు.వారి వద్ద నుంచి రెండు లక్షల తొంబై వేల రూపాయలు విలువ గల 102 క్వింటాల రేషన్ బియ్యం,31 క్వింటాల గోధుమలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా రేషన్ బియ్యంతో పాటు గోధువులు అమ్ముతున్న ముగ్గరిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం భవానీనగర్ పోలీసులకు అప్పగించారు.ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




# ఫారిన్ కిక్..!

**-నగరంలో పెరుగుతున్న విదేశీ మద్యం అమ్మకాలు -ఖరీదైనా... వెనకాడని మద్యం ప్రియులు**

**-పార్టీలు, బడాబాబుల ఫంక్షన్లలో వాడకం -ఒక్కో బాటిల్ ధర రూ.5వేల నుండి లక్ష వరకు..**



**హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త:** స్వదేశంలో విదేశీ మద్యానికి రోజురోజుకూ క్రేజ్ పెరిగిపోతున్నది. మద్యపాన ప్రియులు ఎంత ఖర్చయినా వెనకాడటం లేదు.ఆకర్షనీయమైన డిస్‌ప్లే,ఎయిర్ కండీషన్ దుకాణాలను ప్రారంభిస్తూ మద్యం ప్రియులను ఆకట్టుకుంటున్నారు. వాటిని చూడగానే అందులోకి వెళ్ళాలన్న ఆసక్తి ఉన్నా..అక్కడి మద్యం ధరలు చూస్తే మాత్రం కళ్లు తిరుగుతున్నాయి.దేశీ మద్యంతో విసుగెత్తి పోయిన వారంతా తాజాగా విదేశీ మద్యం కోసం పరుగులు పెడుతున్నారు. జంటనగరాల్లో విదేశీ మద్యం అమ్మకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. సంపన్న వర్గాలు అధికంగా నివసించే ప్రాంతాల్లో విదేశీ మద్యం దుకాణాలు పెద్దసంఖ్యలో వెలుస్తున్నాయి. సూపర్ మార్కెట్,షాపింగ్ మాల్స్ మాదిరిగా 'ఇంపోర్టెడ్ లిక్కర్ మాల్స్ వెలుస్తున్నాయి.ఒక్కో బాటిల్ రూ.5వేల నుండి లక్ష రూపాయల వరకు పలుకుతున్నాయి.నగరంలో ఖరీదైన కిక్కును కోరుకునే వారికే ఇవి అదుబాటులో ఉంటున్నాయి. సాధారణంగా దేశీయ మద్యం ధరలను పక్కన పెడితే విదేశీ మద్యం తాగకముందే కళ్లు తిరిగి పోతాయి. అయినా..విదేశీ మద్యం రుచి చూడాలనుకునే వారికి ఈధరలు పెద్దభారంగా కనిపించడం లేదు. అందుకే వీటికి మంచి క్రేజ్ పెరిగిందని విదేశీ మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యాపారులు తెలుపుతున్నారు.

### విదేశీ బ్రాండ్లకోసం పరుగులు..

రోజురోజుకూ నగరవాసుల్లో విదేశీ మద్యం పట్ల క్రేజ్ పెరుగుతుండటంతో వీటి షాపులు కూడా భారీ ఎత్తున హంగూ ఆర్భాటాలతో వెలుస్తున్నాయి. హైటెక్‌సిటీ,మాదాపూర్,గచ్చిబౌలి,కొండాపూర్,మియాపూర్,కూకట్‌పల్లి,జూబ్లీహిల్స్,బంజారాహిల్స్,సికింద్రాబాద్ ప్రాంతాల్లో విదేశీ మద్యం దుకాణాలు వెలిశాయి. ఇందులో అనేకరకాల బ్రాండ్‌లు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. విదేశీ మద్యంలో జానీవాకకర్ ఎక్సో,జానీవాకర్,జానీవాకర్ ప్లెజర్,జానీవాకర్ బ్లూ,శివాస్‌లీగ్,జానీవాకర్ డబుల్ బ్లాక్, గ్లెన్‌లీవిట్,గ్లెన్‌ఫిడిక్, మేకలాన్, బెయిలీస్, జానీవాకర్ గోల్డ్ లేబుల్,రాయల్ సెల్యూట్, డాన్ పెరి గ్నన్,చివాగ్ రీగల్,చివాగ్‌రీగల్ ఎక్స్‌ట్రా, రెడ్‌లేబుల్,డబుల్‌బ్లాక్,బ్లాక్ లేబుల్ వంటివి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.వీటని కొనడానికి కేవలం ఆప్రాంతాల్లోని వారే కాకుండా శివారు ప్రాంతానికి చెందిన మందుబాబులు కూడా విదేశీ మద్యం కోసం నగరానికి తరలుతున్నారంటే పరిస్థితి అర్థం చేసు కోవచ్చు.

### విదేశీ బీర్లకూ డిమాండ్..

విదేశీ బ్రాండ్లలో బీరుకుకూడా మంచి క్రేజీ ఉంది. ఏకాలమైనా ఈబీర్లు అమ్మకాలు కొనసాగుతున్నాయి.దేశీయ బీర్లకంటే విదేశీ బీర్‌ల ధరలు రెట్టింపుగా ఉన్నాయి. ప్రస్తుతం దేశీంగా లభించే బ్రాండ్ల బీరు ధరలు రూ.150నుండి 200 వరకు ఉన్నాయి. కాగా విదేశీ బీర్లు మాత్రం రూ.300నుండి 400వరకు పలుకుతున్నాయి.నగరానికి స్పెయిన్, బెల్జియం,ఇంగ్లాండ్,మెక్సికో దేశాల నుండి అధికంగా దిగుమతి అవుతున్నాయి. వీటి ధరలు ఎంతయినా విదేశీ బ్రాండ్‌ను రుచి చూడాలనుకునే వారికి ధరలు అడ్డుకావడం లేదని వ్యాపారులు తెలుపుతున్నారు.


జంగోనిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు దృశ్యం

## తల్లిపాలు అమృతంలో సమానం
### ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

**నందిగామ, ఆగస్టు 3 ప్రభాతవార్త** తల్లిపాలు అమృతంలో సమానమని అప్పుడే పుట్టిన పసిపాపకు తల్లిపాలే శ్రేయస్కరమని నందిగామ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. శనివారం నందిగామ మండలం జంగన్నగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ సోని ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్‌సోనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజలక్ష్మి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మా కుటుంబాన్ని వేధించడం మానుకోండి
### సూసైడ్ నోట్ రాసి యువకుడు ఆత్మహత్య

**నందిగామ, ఆగస్టు 3 ప్రభాతవార్త** మా కుటుంబాన్ని వేధించడం మానుకోండని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న యువకుని ఉదంతం శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంకాసేపట్లో మహేష్ మృతదేహాన్ని ఖననం చేసే పనిలో అందరూ నిమగ్నమయ్యారు. ఆ నోట ఈనోట మీడియాలో మహేష్ మృతి చెందడం వైరల్ కావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. మృతుని భార్య పోలీసుల కథనం ప్రకారం.. నందిగామ మండలం రంగాపూర్ గ్రమానికి చెందిన జూకారం మహేష్ (35)ఓ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్ ఆధీనంలో కుకింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వ హిస్తున్నారు. యధావిధిగా అటు ఉద్యోగాన్ని ఇటు వ్యవసాయ పనుల కోసం వచ్చి వెళ్లే వారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.చనిపోయే ముందు మహేష్ రాసిన సూసైడ్ నోట్ లభించడంతో పలు అనుమానాలకు దారితీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. నందిగామ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో సంఘటన ప్రదేశానికి వచ్చిన పోలీసుల మహేష్ రాసిన సూసైడ్ నోట్‌ను పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

## అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి


డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు సాయిబాబ

**నందిగామ, ఆగస్టు 3 ప్రభాతవార్త** అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటను కేటాయించాలని సిపిఎంపార్టీ మండల కార్యదర్శి బీస సాయిబాబ శనివారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**తలకొండపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త** తలకొంపల్లి మండలం చెన్నారం గ్రామంలో బద్దుల సత్యమ్మ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న చెన్నారం మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్‌రెడ్డి ఆర్థిక సాయం చేయడం జరిగింది. మల్లయ్య బుచ్చిరెడ్డి చందు సత్యనారి నరసింహ శ్రీకాంత్‌రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## మండల పరిషత్ అభివృద్ధి అధికారి రివ్యూ మీటింగ్



**తలకొండపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త** శనివారం మండల పరిషత్ కార్యాలయం తలకొండపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5 తేదీ నుంచి 9వరకు గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన పనుల గురించి వివరించడ జరిగింది. ఈ కార్యక్రమంలో క్రింది విషయాల గురించి తెలుపడం జరిగింది. 5న అన్ని గ్రామపంచాయతీలలో ప్రభుత్వ సంస్థలు పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లు హాస్టళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు బస్‌స్టాప్‌లు మొదలగునవి శుభ్రపరచాలి. మరియు పాఠశాలల్లో పారిశుధ్యం మొక్కలు నాటుట, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం యొక్క దుష్ప్రభావం గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. 6న తాగునీరు, వర్షపునీటి నిల్వ అనే అంశంలో భాగంగా అన్ని గ్రామాలలో వాటర్ ట్యాంక్‌లు శుభ్రపరచాలి. తదితర అంశాలను గురించి ఆయన వివరించారు.

## గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కరపత్రం అవిష్కరణ

**కొత్తూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కొత్తూర్‌లో నూతనంగా గ్రామదేవతల అమ్మవార్ల ఆలయాలు నిర్మిస్తున్న సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల కరపత్రాన్ని గ్రామ పెద్దలు శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ....నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయాలు ఈనెల 16,17,18న వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞహోమాలతో ఆలయాలు విగ్రహ ప్రతిష్టాపన చేపట్టడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమాల కరపత్రాన్ని ప్రతి ఒక్కరి చేరవేసేందుకు నేడు ప్రారంభించడం జరుగుతుందన్నారు. గ్రామస్థులు ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులతో అమ్మవారి పూజలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలన్నారు. గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన తర్వాత 16రోజుల వరకు గ్రామదేవతల ఆలయ పరిసరాల్లో మేకలు, కోళ్లు గాని ఎలాంటి జంతు బలిదానం చేయకూడదని తెలిపారు. అమ్మవారి పూజా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పవిత్రంగా పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు బాతుక దేవేందర్‌యాదవ్,జె.గోపాల్‌గౌడ్, డోలి రవి, మాదారం నరసింహగౌడ్, సోమ్లానాయక్, నాగరాజుచారి,జె.కృష్ణయ్య, గోవింద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ గౌడ్, బండి కృష్ణ, బాల్‌రాజ్‌చారి, కె.లక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, బండి శ్రావణ్, విష్ణుమూర్తి, జంగయ్య, దాసరి నరసింహ, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.




ప్రధానోపాధ్యాయునికి మైక్‌సెట్ ఇతర సామాగ్రి అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి : రవీందర్‌రెడ్డి

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా మౌళిక వసతులు ఉన్నప్పుడే వారు విద్యలో రాణించగలరని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి అన్నారు.షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామ మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌కు ఆయన శనివారం బీరువా, మైక్‌సెట్, టేబుళ్లు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల్లో మౌళిక వసతులు ఉన్నప్పుడే వారు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించి ఈపోటీ ప్రపంచంలో ముందు ఉండగలరన్నారు. అందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఎల్గొండగూడ ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్‌గౌడ్, గ్రామస్థులు ఉన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యంగా ఉండాలని భాస్కర ఆసుపత్రి వైద్యుడు క్రాంతి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చిన్నసోలిపేట్ గ్రామంలో భాస్కర్ ఆసుపత్రి, శ్రీబాలాజీ దంత వైద్యశాల ఆసుపత్రి వారు కలిసి ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈవైద్యశిబిరంలో అన్ని రకాల రోగులకు, దంతాలకు సంబంధించిన సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 105మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శాస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సంబంధిత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదల కోసం గ్రామాల్లోనే నిర్వహిస్తున్న ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి ప్రత్యేకంగా రవాణ సౌకర్యం ఏర్పాటు చేసిన భాస్కర ఆసుపత్రి సేవలందిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో వెల్స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్‌హెడ్ సురేఖ, వైద్యులు సాయికృష్ణ, సాహితి, వెల్స్పన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, శిరీష,సంధ్య, భాస్కర్ ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

## చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేదే అంగన్‌వాడీ


అంగన్‌వాడీ టీచర్లను సన్మానిస్తున్న సీడీపీవో

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేదే అంగన్‌వాడీ అని చేవెళ్ల సీడీపీవో శోభారాణి అన్నారు. అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ సందర్భంగా షాబాద్ మండలానికి చెందిన శకుంతల, ఎర్రోనిగూడ సర్వసతి, కేశవగూడ టీచర్లను చేవెళ్లలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అంగన్‌వాడీ అంటే అమ్మవడి అని, చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేదే అంగన్‌వాడీ కేంద్రాలు అన్నారు. గత 35 సంవత్సరాలుగా వీరు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించారన్నారు.వీరి చేతులో చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు తదితరులు ఉన్నారు.

## పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించాలి

**కేశంపేట, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం ఎంపిడివో రవిచంద్ర కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల పరిషత్‌ప్రత్యేక అధికారి రాజారత్నం సమక్షంలో వనమహోత్సం మరియు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించుటకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీ నుంచి 9వరకు నిర్వహించవలసిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని కచ్చితంగా ప్రతి గ్రామపంచాయతీలో నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. గ్రామపంచాయతీలలోని స్థానిక నాయకులు మహిళాసంఘాలు యువత మరియు ప్రజల భాగస్వామ్యంతో రోజువారి కార్యక్రమాలను విజయవంత చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు అధికారులు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మనో ప్రగతి క్యాంపు విజయవంతం : ఏపిఎం భగవంతు



**కేశంపేట, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో మనో ప్రగతి క్యాంపు నిర్వహించడం జరిగింది. ఏపిఎం భగవంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులకు మన పురుగతి సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని వారు పురోగతి సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశ కార్యక్రమానికి జిల్లా నుంచి ప్రొఫెషనల్ థెరపిస్ట్ సురక్షిత స్పెషల్ ఎడుకేటర్ కవిత సెంటర్ నిర్వాకులు సిపి నర్సింహా యాక్టీవిస్ట్ వసంత ఐఐ సీఆర్పీ అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన దివాకర్ సహు (46) జూలై 29వ తేదీ రాత్రి 9:30 గంటలకు బైక్ (ఏపీ05ఏక్యూ-6627)పై ఇంటికి వస్తుండగా ఎదులాబాద్ రోడ్డుపై మేదకాలనీ రోడ్డు చెట్టేరుకుంట వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఆపకుండా వెళ్లింది. దీంతో దివాకర సహుకు తీవ్ర గాయాలై కింద పడిపోయాడు. పోలీసు పట్రోలింగ్ వాహనం అటుగా వెళ్తుండగా ప్రమాదం జరుగడంతో వెంటనే గాయాలైన దివాకర్‌ను కమ్యూనిటీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు.


నాగారం మున్సిపాలిటీ 9వ వార్డులో తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న కౌన్సిలర్ కొమురెల్లి అనిత సుధాకర్‌రెడ్డి

## తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించాలి

**కీసర, ఆగస్టు3, ప్రభాతవార్త:** తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించాలని నాగారం మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ కొమురెల్లి అనిత సుధాకర్‌రెడ్డి కోరారు.శనివారం మున్సిపాలిటీ పరిధిలోని విజయపురి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను జరిగాయి. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తల్లి నుండి మొదటగా వచ్చే పాలను ముర్రు పాలు అంటారన్నారు.ఈ పాలవల్ల తల్లి బిడ్డకు అనుబంధం ఏర్పడుతుందని అన్నారు.తల్లి పాలవలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ఐక్యూ లెవల్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగిందన్నారు.ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యశోద తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు



**మొయినాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త** మొహినాబాద్ మండలపరిధిలోని నాగిరెడ్డి గూడ గ్రామం నుంచి శంషాబాద్ మండలం కవగుడా గ్రామానికి వెళ్లడానికి హిమాసాగర్ ఈసి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో బ్రిడ్జి శాంక్షన్ అయి తిరికి క్యాన్సిల్ అయిందని తిరిగిఆ బ్రిడ్జి నిరిస్తే శంషాబాద్ మండలానికి మొయినాబాద్ మండలానికి అతి తక్కువ సమయంలో రావడానికి పోవడానికి వీలు పడుతుందని శంషాబాద్ వెళ్లాలంటే నాగిరెడ్డిగూడెం నుంచి అజిత్‌నగర్ వచ్చి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చుట్టూ 15 కిలోమీటర్ల దూరం ఎక్కు ప్రయాణించాల్సి ఉంటుందని దీనితో రాకపోకలకు చాలా ఇబ్బంది కరంగా మారిందని నాగిరెడ్డిగూడం గ్రామానికి చెందిన రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ మరియు గ్రామస్తులను కలుపుకుని బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం చనువెల్లి ప్రభాకర్‌రెడ్డి తదితరులు వెళ్లి ఆయన నివాసంలో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అదే విధంగా నాగిరెడ్డి గూడ గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ప్రత్యేకంగా వారు కోరగా వెంటనే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా బ్రిడ్జి నిర్మాణం కోసం మరియు గ్రామాభివృద్ధికోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు గ్రామస్తులు తదితరు లు పాల్గొన్నారు.

## పడకల్ జడ్పిహెచ్ఎస్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలి

**తలకొండపల్లి , ఆగస్టు 3 ప్రభాతవార్త** తలకొండపల్లి స్కూల్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తలకొండపల్లి మండల ఎంపిడివోకు పడకల్ గ్రామ జడ్పిహెచ్ఎస్ స్కూల్ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్కూల్లో బాత్రుంలు సరిగ్గా లేవు. స్టూడెంట్ ఆడుకునే గ్రౌండ్లో గుంతలు పడి నీళ్లు నిలిచాయి. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు జి పెంటయ్య మాజీ సిపిఎం నాయకులు ఎల్ వెంకటరెడ్డి తదితరులు కోరారు.

## స్వచ్ఛదనం, పచ్చదనంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, ఆగస్టు3, ప్రభాతవార్త:** స్వచ్ఛదనం""పచ్చదనం"లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు.శనివారం మున్సిపాలిటీ పురపాలక సంఘం కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు,బిల్ కలెక్టర్లు,వర్క ఇన్స్‌పెక్టర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ప్రతి వార్డులో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమం గురించి ప్రతి వార్డులోని ప్రజలకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ రాజేంద్రకుమార్,కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్,డిప్యూటీ ఇంజనీర్ సుదర్శనం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు కట్టడాలు.. చూస్తున్న అధికారులు

**కొత్తూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కొత్తూర్‌లో పురపాలికలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్ శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో దేవేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ....గతంలో కొత్తూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు అని అనుమతులతో పేదలు మొదటి అంతస్తు ఇల్లు నిర్మించుకున్నారు. ఇప్పుడు రెండో అంతస్తు నిర్మించుకుంటే మున్సిపల్ అధికారులు అనుమతులు లేవని నిర్మాణాలను అపుతున్నారు. ఇది చాలా అన్యాయమని, అధికారుల తీరు సమంజసంగా లేదని విమర్శిస్తూ, అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం జరిగితే పట్టించుకోవడం లేదని, కానీ పేదల విషయంలో మాత్రం అనేక ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలకు విరుద్ధంగా అధికారులు ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకముందు కూడా అధికారుల తీరు మారకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమం చేపడుతామన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఈనెల 3 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ప్రత్యేకాధికారి- మేడ్చల్ డిపీసీ జనరల్ మేనేజర్ ప్రశాంత్‌లు కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిలర్లు, అధికారులు, ఆర్‌పీలతో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో సోమవారం నుంచి పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటాలని, పార్కులను శుభ్రం చేయాలని, వీధిక్కుల బెడదపై ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో చెత్తను వేరు చేయడంపై దృష్టి సారించాలని, అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ, హస్టళ్లు, ఆరోగ్యకేంద్రాలు, బస్టాపులు తదితర ప్రజా స్థలాలను పరిశుభ్రం చేయాలన్నారు. త్రాగునీటి వనరులు (ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్) ట్యాంకులను శుభ్రం చేసి ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని దోమల వృద్ధిని నిరోధించేందుకు ఆయిల్‌బాల్స్ తగినంత సంఖ్యలో తయారు చేసి నిల్వ ఉన్న నీటి గుంతల్లో వేయాలని సూచించారు. ఈసమావేశంలో కమీషనర్ ఎండి.సాబేర్‌అలీ, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బొక్క సంజీత పాల్గొన్నారు.



## పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించాలి

**తలకొండపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త** తల్లిపాలే అమృతం అని గట్టుఇప్పలపల్లి ఎహెచ్ఇవో డాక్టర్ ఆంజనేయులు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ సెక్టార్‌లోని చౌదర్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలతోపాటు ఘనంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టుఇప్పలపల్లి ఏహెచ్ఇఓ డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 1నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమవుతాయి. బిడ్డపుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నదే వారోత్సవాల ఉద్దేశం. అమ్మపాలు అమృతం నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయి. ప్రకృతి సిద్దంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి. తల్లిపాలలో వివిధ రకాల షోషకాలుంటాయి. అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయి. అనారోగ్య సమసయలు రాకుండా ఉండాలంటే అపోహలు వీడి తప్పకుండా బిడ్డకు పాలు పట్టించాలి. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టిస్తే సహజ రోగనిరోధక శక్తి కలిగేలా చేస్తాయి. ఈ కార్యక్రమంలో గట్టుఇప్పలపల్లి ఏహెచ్ఇఓ డాక్టర్ ఆంజనేయులు అంగన్‌వాడీ టీచర్స్ నిర్మల ఏఎన్ఎంలు సువర్ణ సుజాత ఆశ వర్కర్ మాదవి ఆయాలు వరలక్ష్మి గర్భిణులు పాలిచ్చే తల్లులు కవిత శివనీల అస్మాబేగం అచల మంజుల శ్రీలత హరిత తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేశాం


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న గ్రామస్థులు

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఐదు సంవత్సరాలు గ్రామాన్ని అందరి సహకారంతో పార్టీలకతీతంగా అభివృద్ధి చేశామని పోలారం మాజీ సర్పంచ్ మంగమ్మ,ఉపసర్పంచ్ కొత్రేపల్లి శివకుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పోలారంలో సర్పంచ్ మంగమ్మ, ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్, వార్డు సభ్యులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజాప్రతినిధులు,అధికారుల సహకారంతో గ్రామంలో సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశామన్నారు. మరోసారి ప్రజలు అవకాశమిస్తే మరింత సేవ చేస్తామన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి కరుణాకర్ బదిలీపై వెళ్లడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, రత్నం, అంజయ్య తదితరులు ఉన్నారు.

## మూడు గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలుపొద్దు
### అఖిల పక్ష నాయకుల డిమాండ్


అవుశాపూర్‌లో అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 3, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్, అంకుశాపూర్, మాదారం గ్రామాలను మేడ్చల్ జిల్లా నుండి యాదాద్రి జిల్లాలో కలుపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిల పక్ష సమావేశంలో నాయకులు తెలిపారు. మూడు గ్రామాలను ప్రక్కనే ఉన్న యాదాద్రీ జిల్లాలోనే కలుపాలనే ఆలోచన విరమించుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ డిమాండ్ చేశారు. ఈ విషయమై అవుశాపూర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం అన్ని పార్టీల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. మొదట రంగారెడ్డి జిల్లా నుండి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోకి నేడు యాదాద్రీ జిల్లాలోకి మార్చాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని అన్నారు. కొందరి స్వార్థ రాజకీయాల కొరకు తమ పంచాయతీలను మేడ్చల్ జిల్లా, నియోజకవర్గం నుండి మరో జిల్లాలో కలుపే విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశంలో నాయకులు అన్నారు. తమ గ్రామాలను ఘట్‌కేసర్ మండలంలోనే ఉంచి నగర పంచాయతీగా లేదా ఘట్‌కేసర్ మున్సిపాల్టీలోనైనా వీలినం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇక్కడి ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహారిస్తే ఆందోళనలు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బాలుడిని గాయపర్చిన కుక్క

**మేడ్చల్, ఆగస్టు 3. ప్రభాతవార్త :** ఆరు బయట ఓ బాలుడిని కుక్క కరిచిన సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్ గ్రామ నివాసి రమేష్ కుటుంబం మేడ్చల్ పట్టణంలో నివాసముంటున్నారు. అతని కొడుకు చరణ్ కుమార్ (8) శనివారం ఉదయం పాఠశాలకు బయలు దేరడానికి ఇంటి బయటకు రాగానె అక్కడే ఉన్న కుక్క దాడి చేసి కరిచింది. దీంతో బాలుడి కాలికి గాయాలయ్యాయి.

## మేడ్చల్ మున్సిపాలిటిలో చెత్త సేకరణకు వాహనాలు అవసరం

**మేడ్చల్, ఆగస్టు 3. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపాలిటీలో వాహనాలతో ఇంటింటి చెత్త సేకరణకు వాహనాలు అవసరమని, ఆసక్తి గల ఏజెన్సీలు, వాహన యజమానులు కార్యాలయంలో వివరాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. పూర్తి దస్తావేజులు ఉన్న ఆటో, ట్రాక్టర్ కలిగి ఉండి డ్రైవర్‌ను సమకూర్చుకుని పట్టణంలోని ఇంటింటి నుంచి చెత్తను సేకరించాలని తెలిపారు చెత్త సేకరించినందుకు ప్రతి ఇంటి నుండి రూ 50 లు వసూలు చేసుకునేందుకు అనుమతించబడునని పేర్కొన్నాడు. ఇతర వివరాలకు 7032898999 నంబరులో సంప్రదించాలని కోరాడు.

## కోట్‌పల్లి నూతన తహశీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు

**కోట్‌పల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండల నూతన తహశీల్దార్‌గా కె, శ్రీనివాస్ శనివారం నాడు బాధ్యతలు స్వీకరించారు. గత వారం రోజుల క్రితం వచ్చిన ఇంచార్జి తహశీల్దార్ మహేష్‌కుమార్‌ను బంట్వారం డిప్యూటీ తహశీల్దార్‌గా వెళ్ళగా కోట్‌పల్లి మండలానికి నూతన తహశీల్దార్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పని చేసిన శ్రీనివాస్‌ను బాధ్యతలు స్వీకరించారు. తహశీల్దార్‌తో పాటు డిప్యూటీ తహశీల్దార్‌గా హైదరాబాద్ నుండి వచ్చిన మహమ్మద్ యూనుస్, సైతం బాధ్యతలు చేపట్టారు.

## రసాయనరహిత పదార్థాలను అందించాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా గుర్తింపు వస్తుందని ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ జోడిమెట్లలో అథెంటిక్ బెంజిల్ వేఫిల్ విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభోత్సవం చేశారు. సొసైటీ డైరక్టర్ గోపు బాల్‌రాజ్‌యాదవ్, శివకృష్ణయాదవ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేఫిల్ చాక్లెట్, షేక్స్, రసాల విక్రయ కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా విచ్చేసిన నాయకులను శాలువాతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, బోడుప్పల్ ఎంసీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కార్పొరేటర్ చీరాల నర్సింహ్మా, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, సొసైటీ వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, గోపు బాల్‌రాజ్, మాజీ ఉపసర్పంచ్ పల్లె బాబురావుగౌడ్, నాయకులు బండ్లగూడెం నాగేశ్‌గౌడ్, బండ్లగూడెం అనిల్‌కుమార్‌గౌడ్, నర్సింగ్‌రావు, గోపు లక్ష్మయ్య, బైరపాండు, దయానంద్, విఘ్నేష్, ఐలయ్య, లంబ సత్యనారాయణ, భాస్కర్, మెదబోయిన సంజీవ, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన బాలమైసిని శ్రీధర్‌కు శనివారం ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. అనారోగ్యంతో శ్రీధర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు చెల్లించడంతో సీఎం ఆర్ఎఫ్ పథకానికి ధరఖాస్తు చేసుకున్నాడు. ఈమేరకు సిఎం సహాయనిధి నుంచి చెక్కు మంజూరు కావడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ గ్రామ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు అల్లం శంకర్, ప్రధానకార్యదర్శి కోతాన్‌పోన్ చిరంజీవి, బీసీ సెల్ అధ్యక్షులు ఆరుట్ల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో ప్రజలు పాల్గొనాలి



మొక్కలు అందజేస్తున్న చైర్‌పర్సన్, కమీషనర్, కౌన్సిలర్

ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త: ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ ఎండి.సాబేర్‌అలీలు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 10 వవార్డులోని బాలాజీనగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద శనివారం ప్రజలకు పలు రకాల మొక్కలను వారు పంపిణీ చేశారు. మొక్కలు నాటి పచ్చధనం పెంపొందించాలని, ఇంటి పరసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని వారు సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకొని చెట్లుగా పెరిగే వరకు నీటిని అందించాలన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు బర్ల శశికళ, కుతాడి రవీందర్, పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, నాయకులు వెంకట్‌రెడ్డి, సార హనుమంతు, మహిళలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి స్వచ్ఛధనం-పచ్ఛధనం నిర్వహించాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఈనెల 5 నుంచి 9 వరకు గ్రామాల్లో స్వచ్ఛధనం-పచ్ఛధనం కార్యక్రమం నిర్వహించాలని మండల ప్రత్యేకాధాకారి-డీఆర్‌డిఓ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో శనివారం ఎండిడిఓ ఎల్.గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి శుక్రవారం గ్రామాల్లో స్వచ్ఛధనం-పచ్ఛధనం కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది రోజువారి పుల్లో భాగంగా రోడ్లు, వీధులు శుభ్రం చేసి మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చేపట్టవలసిన వివిధ అంశాలపై ప్రత్యేకాధికారి సమావేశంలో తెలియజేశారు. స్వచ్ఛధనం-పచ్ఛధనం విజయవంతం చేసేలా ప్రజలను భాగస్వాములు చేయాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో ఎంపిఓ రవి, గ్రామకార్యదర్శులు, పిహెచ్‌సీ వైద్యాధికారిణి, మండల సమాఖ్య ఎపిఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ డి నుంచి ఏలోకి మార్చాలి



ఘట్‌కేసర్ తహశీల్ వద్ద నినాదాలు చేసి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ నాయకులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ముదిరాజ్‌లను బీసీ 'డీ గ్రూపు నుంచి 'ఏ' గ్రూపులోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోర రవికాంత్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి కందుల కుమార్ ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులోకి మార్చాలంటూ ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఘట్‌కేసర్ తహశీల్ కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన తెలిపారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు ఉదారి వేణుగోపాల్ ముదిరాజ్ అధ్యక్షతన మండలంలోని ఆయా గ్రామాల నుంచి ముదిరాజ్‌లు చేరుకొని ఏ గ్రూపులో చేర్చాలని నినాదాలు చేసిన అనంతరం తహశీల్దార్‌ను రజిని ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2023 ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన అభయహస్తం హామీ మేరకు సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వు 15 ప్రకారం ఏ గ్రూపులోకి మార్చడానికి తెలంగాణ బీసీ కమీషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ముదిరాజ్‌లకు మంత్రి వర్గంలో స్థానం, శాసనమండలిలో 3 స్థానాలు, రాజ్యసభలో ఒక స్థానం, 10 శాతం కార్పొరేషన్‌లలో ముదిరాజ్‌లను చైర్మన్లుగా నియిమించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండి ముదిరాజ్ మత్స్యకారులకు కూడా ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం 100 శాతం మత్స్యకారులకు చేరే విధంగా లేదా సమానమైన నగదును సొసైటీలకు అందించాలని కోరారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేస్తున్నందున సంవత్సరానికి వెయ్యి కోట్ల రుపాయల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు గుండ్ల బాల్‌రాజ్, మెదబోయిన వెంకటేశ్, నిరుడి లింగం, జవాజీ సత్తయ్య, నిరుడి శంకర్, బర్ల రాధాకృష్ణ, నిరుడి అశోక్, పూల శ్రీనాథ్, నిరుడి శ్రీనివాస్, రాజ్‌కుమార్, జవాజీ లింగం, పసులాది నర్సింగ్‌రావు, మెదబోయిన నరేశ్, ఉదారి హరిబాబు, కందుల రామకృష్ణ, బాల్‌రాజ్, నర్రా పోచయ్య, బర్ల రాములు, పిట్టల రాజు, మెదబోయిన రాజు, నవీన్, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు సమస్యలు కల్గకుండా చూడాలి
### ఆటో డ్రైవర్లకు ఎస్ఐ సూచనలు

**జహీరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లు పట్టణంలో ప్రయాణీకులకు ఆటంకాలు కల్గకుండా తమ ఆటోలను ఆపుకోవాలని ఎస్ఐ సూచించారు. పట్టణంలోని పోలీసు ఠాణాలో శనివారం ఆటో డ్రైవర్‌లకు తగు సూచనలు, సలహాలు అందచేశారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండు ముందు, సింధు టిఫిక్ సెంటర్ వద్ద, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో , తిరుమల లాడ్జి ముందు, బ్లాక్ రోడ్డు కార్నర్‌పై, భవాని మందిరం చౌరస్తా, శ్రీనివాస్ టాకీస్ ముందర ఆటోలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గకుండా, అంబెలెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆటోకు మై ఆటో ఈస్ సేఫ్ స్టిక్కరు అంటించుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



అక్రమ నిర్మాణాల అభియోగంపై రైస్‌మిల్ షెడ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

## ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను కూల్చిన అధికారులు

**కొడంగల్,ఆగస్టు 3ప్రభాతవార్త** ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝులిపించారు.ప్రభుత్వ స్థలంలోని కొంత భాగంలో రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టినట్లు వచ్చిన అభియోగంపై శనివారం వివిధ శాఖల అధికారులు జేసీబీలతో రైస్‌మిల్లులో కబ్జాకు గురైన ప్రదేశాన్ని కూల్చివేశారు.సంఘటనకు సంబందించి అధికారుల కధనం మేరకు..కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీవైస్ వైస్ చైర్మేన్ క్రిష్ణ దుద్యాల స్టేజీ సమీపంలో కొంత మేర భూమిని కొనుగోలు చేశారు.ఇందులో గత సంవత్సరం రైస్‌మిల్ నిర్మాణం చేపట్టాడు.రైస్‌మిల్ ప్రభుత్వ స్థలంలో ఉందని తెలుసుకున్న డీపీఓ,రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో శనివారం 5 గంటల సమయంలో దుద్యాల స్టేజీ సమీపంలోని రైస్‌మిల్‌కు చేరుకున్నారు.ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారనే అభియోగంపై 5 జేసీబీలతో కూల్చడం ప్రారంబించారు.విషయం తెలుసుకున్న మాజీ జడ్పీవైస్ చైర్మేన్ క్రిష్ణ అక్కడికి చేరుకొని ఎందుకు కూలుస్తున్నారని ప్రశ్నించడంతో కొద్ది సేపు వాగ్వివాదం చోటుచేసుకుంది.ప్రభుత్వ స్థలంలో కబ్జాలో ఉనా న్నవని అధికారులు తెలుపడంతో అందుకు రైస్‌మిల్ నిర్మాణానికి సంభందించిన డాక్యుమెంట్‌లు అధికారులకు చూపించారు.కాగా అప్పటికే రైస్‌మిల్‌కు సంభందించిన మూడు పిల్లర్లను కూల్చే పనులు చకచకా జరిగిపోయాయి.సుమారు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని క్రిష్ణ వాపోయారు.ఈ విషయమై దుద్యాల తహశీల్దార్ దానయ్యతో ప్రస్థావించగా సర్వే నెంబర్ 1090లో 1.02 ఎకరాల్లో కబ్జాలో ఉన్నాడని అందులోని 9 గుంటల భాగంలో రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టారని తెలిపారు.అలాగే రైస్‌మిల్ పక్కన నిరా మ్ణం చేస్తున్న ఫంక్షన్‌హాల్‌కు నేటికి అనుమతులు రాలేదని,వే బ్రిడ్జీ ముందు నిర్మాణం చేసిన భవనానికి సంభందించి గదులకు అనుమతులు రాలేదని అధికారులు తెలిపారు.వాటి అనుమతులు వచ్చిన అనంతరం పనులు ప్రారంబించాలని అధికారులు పేర్కొన్నారు.డీపీఓ జయసుధా,వివిధ శాఖల అధికారులతో పాటు సీఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్సైలు,పోలీసు సిబ్బందితో కలిసి వెళ్ళి కూల్చివేసినట్లు తెలిపారు.కబ్జాలో ఉన్న ప్రదేశాన్ని నెలరోజుల లోపు ఖాళీ చేస్తానని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు సమాచారం.కాగా ఇదే విషయమై మాజీ జడ్పీవైస్ చైర్మేన్ క్రిష్ణ దృష్టికి తీసుకువెళ్ళగా తాను ఎక్కడా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయలేదని,తన రైస్‌మిల్ వెనక భాగంలో ప్రభుత్వ స్థలం ఉందని,అయినా ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తన రైస్‌మిల్‌ను పాక్షికంగా కూల్చివేశారని అన్నారు.తనపై రాజకీయ కక్ష్యతోనే ఇలా చేశారని పేర్కొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

**బొంరాస్‌పేట్,ఆగస్టు3,ప్రభాతవార్త** : దుద్యాల్ మండల కేంద్రంకు సమీపంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన రైస్‌మిల్ భాగంను డిపిఓ జయసుధ,డిఎల్పీఓ శంకర్‌నాయక్,తహసీల్దార్ దానయ్య అధికారులతో కలిసి కూల్చివేశారు.వారు తెలిపిన వివరాల ప్రకారం దుద్యాల గ్రామం సర్వే నంబర్ 1090లో ఉన్న ప్రభుత్వ భూమిలో గురు రాఘవేంద్ర రైస్‌మిల్‌ను నిర్మించడం జరిగిందని శనివారం ఉదయం అధికారులు,పోలీస్‌లతో కలిసి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రైస్‌మిల్ భాగాన్ని జెసిబిల సహాయంతో కూల్చివేయడం జరిగిందన్నారు.వారి సొంత పట్టాభూమిలో నిర్మించిన వాటికి కూడా నోటీస్‌లు ఇవ్వడంతోపాటు వాటికి కూడా అనుమతులు తీసుకోవాలని యాజమాన్యంకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ సిఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్‌ఐలు రాహుఫ్,రవిగౌడ్,పోలీస్,రెవేన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపటి నుంచి స్వచ్ఛదనం-పచ్ఛదనం

**కంది, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఈ నెల 5వ తారీఖు నుంచి 9వ తేదీ వరకు గ్రామ పంచాయితీలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించను న్నట్లు ఎంపిడిఓ తెలిపారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 5న స్వచ్ఛదనం-పచ్చదనం, ఆగస్టు 6న తాగునీరు, వర్షపు నీర సంరక్షణ, ఆగస్టు 7న మురుగుకాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలు పూడ్చడం, ఆగస్టు 8న ఆరోగ్యం, ఈధి కుక్కల బెడదపై దృష్టి, ఆగస్టు 9న ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల శుభ్రత, వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రత్యేక అధికారులు, యవుజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ సూచించారు.

## మండలంలో జోరుగా టిపిటిఎఫ్ సభ్యత్వాలు

**కంది, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం టిపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహించారు. మండలంలోని చేరియల్ జిల్లా పరిషత్, సిపిఎస్, ఒడిఎఫ్ ఎంపిపిఎస్, మామి డిపల్లి ఎంపిపిఎస్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, సోమశేఖర్, యండ ఖరోద్దిన్, జిల్లా ఉపాధ్యక్షులు విజయభాస్కర్, మండల అధ్యక్షులు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, నాయకులు శ్రీధర్, సుదర్శన్‌గౌడ్, యాదగిరి, నర్సింలు తదతరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

పాపన్నగౌడ్ జయంతిని ఈనెల 18న ఘనంగా నిర్వహిద్దామని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె బాలకిషన్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాపన్నగౌడ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. అసోసియేషన్, సిద్దిపేట గౌడ్ సంఘం ఆధ్వర్యంలో గత కొన్ని యేండ్ల నుంచి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 18 జరిగే పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలకు సిద్దిపేట గౌడ సంఘం సభ్యులతో పాటు జిల్లా,నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల గౌడ కులస్తులు, బహుజనులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పాపన్నగౌడ్ చౌరస్తాకు స్థలం కేటాయించిన మాజీ మంత్రి, హరీష్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సులకు అయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు పల్లె కనకయ్యగౌడ్, బాలగోని నర్సింలుగౌడ్, బొల్గం శివలింగంగౌడ్, రామంచ మల్లేశంగౌడ్, గాదగోని శ్రీనివాస్‌గౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, పల్లె రామస్వామిగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, గుర్రం రాజుగౌడ్,అంజయ్యగౌడ్,అంబటి ప్రకాష్‌గౌడ్, పల్లె శంకర్‌గౌడ్,గాదగోన ప్రసాద్‌గౌడ్,చింతకింది రాముగౌడ్,గాదగోని సాయిగౌడ్, చింతకింది రాముగౌడ్,వడ్లకొండ గణేష్‌గౌడ్,నవీన్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా హాస్టల్‌ను పరిశీలించిన డీఈఓ

**నాగల్‌గిద్ద, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. భవనంలోకి గదులను పరిశీలించి నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న నేషనల్ అచ్యుమెంట్ సర్వేకు సంబంధించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు గుండేరావు పాటిల్, అంజిరెడ్డి, విఠల్‌రావు, సచిన్, ప్రధానోపాధ్యాయులు శంకర్ రవీంద్రరావు, టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.



కస్తూర్భా హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

## డ్రగ్స్‌కు బానిసై భవిష్యత్తును భారం చేసుకోవద్దు
### -విద్యార్థులకు సిఐ మహేష్‌గౌడ్ సూచన

**సదాశివపేట, ఆగస్టు 3, ప్రభాతవార్త:** విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసై తమ భవిష్యత్తును భారం చేసుకోవద్దని సిఐ మహేష్‌గౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కమిటి ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌లను నిర్మూలిద్దాం, సమాజాన్ని కాపాడుకుందాం అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సంర్భంగా సిఐ మహేష్‌గౌడ్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, డాక్టర్ క్రిష్ణమూర్తి, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యంలు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆదారపడి ఉంటుందన్నారు. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమని, డ్రగ్స్‌కు అలవాటు పడితే అవా లేకుండా పోతాయని అందుకు డ్రగ్స్‌క ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలన్నారు. మాధక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు యువత తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం తీర్చేందుకు యువకులు ముందుండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలను వినియోగించిన, అమ్మకాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలను అరికట్టాలనుకుంటే అది సాధ్యమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు సాయి, శివ, గోవర్ధన్, యూసుఫ్, ప్రశాంత్, కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజ్, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, రాజు , రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో రైతు మృతి

**హుస్నాబాద్‌రూరల్,ఆగస్టు03,ప్రభాతవార్త** గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది.వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన తిప్పట్ల మొండయ్య (58)కు బందించిన 2ఎకరాల భూమిలో గతంలో కొంత భూమి కెనాల్‌కు పోగా మిగిలిన భూమిలో మరికొంత భాగం మరో కాలువ నిర్మాణానికి పోతుండడంతో మనస్థాపానికి గురై గుండెపోటుతో మరణించినట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది.అయితే మొండయ్యకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిలో వ్యవసాయం చేసుకుంటే కుటుంబాన్ని పోశించుకునే వాడని,ఉన్న భూమిలో గతంలో కొంత కెనాల్‌కు పోగా మళ్లీ రెండవ సారి సైతం కాలువకు పోతుందనే దిగులుపడే వాడని,ప్రభుత్వం అందించే నష్ట పరిహారం వాస్తవ భూమి ధరకు ఏమాత్రం సరితూగదని మాట్లాడుతూనే గుండెపోటుకు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు మృతుని బందువులు చెబుతున్నారు.మృతి చెందిన మొండయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్‌పార్టీ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య,అయిలేని మల్లిఖార్జునరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## నిధుల మంజూరు పట్ల హర్షం
### సీఎం,మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

**హుస్నాబాద్,ఆగస్టు02,ప్రభాతవార్త** గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 437కోట్లు మంజూరు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం రోజున హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం సముద్రాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పున్న సత్తయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గద్దం రాజశేఖర్‌రెడ్డి,జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చేర్యాల తిరుపతి,ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి తిరుపతి,శ్రీనివాస్, హరికృష్ణ, సత్తయ్య, యాదయ్య,సుధాకర్‌రెడ్డి,ఉప్పుల వెంకన్న,కనుకయ్య,సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు పేరు తొలిగించొద్దు
### ఆర్యవైశ్య నాయకుల డిమాండ్

**సిద్దిపేట అర్బన్,ఆగస్టు 3,ప్రభాతవార్త:** భాష ప్రయుక్త రాష్ట్రాల కోసం అమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర అవతారానికి తన ప్రాణాలను సైతం అర్పించిన పొట్టి శ్రీరాములు పేరున ఉన్న తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించి సురవరం నప్రతాప్‌రెడ్డి పేరును పెడతామని అసెంబ్లీలో చెప్పడం సరికాదని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రత్నాకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్‌లు అన్నారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలిగించొద్దని వారు డిమాండ్ చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి చేసిన సేవలను గుర్తింపుగా మరేదైనా ప్రాజెక్టుకు వారి పేరును పెట్టాలని కోరారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఏ ఒక్క రాష్ట్రానికో జాతికో చెందిన వ్యక్తి కాదని అందరివాడని భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలు ఏర్పడాలని ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అన్నార. ఇప్పటికైనా రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని పునఃపరిశీలించాలన్నారు.

## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన రాష్ట్ర నాయకులు

**హుస్నాబాద్,ఆగస్టు 03,ప్రభాతవార్త** కేంద్ర హోం సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌ని శనివారం రోజున బిజెపి ఎస్సి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు,కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారిలు పార్లమెంట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్బంగా వారు బండి సంజయ్‌ని శాలువాతో సత్కరించగా రాష్ట్ర నాయకత్వం లో చోటు సంపాదించుకుని మొదటి సారి ఆయనను కలిసిన రాష్ట్ర నాయకులకు బండి సంజయ్ సైతం శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు రాంప్రసాద్,కోశాధికారి ఆకోజు అరుణ్‌కుమార్,అక్కన్నపేట పార్టీ కార్యదర్శి రాకేష్‌రెడ్డి,బానోతు అనీల్,భూక్య సుధాకర్‌నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

**అక్కన్నపేట,ఆగస్టు03,ప్రభాతవార్త** అక్కన్నపేట మండలంలోని అంతకపేట గ్రామానికి చెందిన కడారి రాజుతో పాటు కట్కూర్ గ్రామ పరిధిలోని దాసుతండాకు చెందిన గుగులోతు కిషన్,రేగొండ గ్రామానికి చెందిన దమ్మిడి మల్లారెడ్డిలు గతంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన సీఈఐఆర్‌లో ధరఖాస్తు చేసుకోగా ఫోన్ ఐఎంఈఐ నంబర్ ద్వార ఫోన్లను ట్రేస్ చేసిన పోలీసులు శనివారం రోజున వాటిని స్వాదీనం చేసుకున్న ఎస్ఐ విజయ్ భాస్కర్ బాదితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకున్నా,దొంగతనానికి గురైనా సీఈఐఆర్‌లో నమోదు చేసుకుని పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలన్నారు.ఇలా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఎంతో మంది సెల్‌ఫోన్లను ఇదివరకే పోలీస్‌శాఖ పట్టుకుని బాదితులకు అందజేసినట్లు తెలిపారు.బాదితులకు సెల్‌ఫోన్ అందించిన వారిలో కానిస్టేబుల్ హరీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## జాగ్రత్తలు పాటిద్దాం-అధిక దిగుబడులు పొందుదాం
### -నాగల్‌గిద్దలో పంటలను పరిశీలించిన ఏఓ



**నాగల్‌గిద్ద, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రైతులు జాగ్రత్తలు పాటిస్తూ పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో రైతులు సాగు చేస్తున్న పంటలను వెంకటేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ వెంకటేశం రైతులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. పత్తి, సోయాబీన్ పంటల సాగుపై తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. గుర్తింపు పొందిన మందులను పంటలకు పిచికారి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎరువుల, విత్తనాల దుకాణాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏఓ వెంకటేశం వెంట డీలర్లు రమేష్, జనార్ధన్‌రెడ్డి, సచిన్, ఉమేష్ తదితరులు ఉన్నారు.



సామాజిక ఆసుపత్రిలో సూపరింటెండెంట్ అనురాధను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

## ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అనురాధ

ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా డాక్టర్ అనురాధ బాధ్యతలు చేపట్టారు. ఈసందరభ్రంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ఆసుపత్రిలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈసందర్భంగా సూపరిటెండెంట్‌తో ఆమె సమావేశమై ఆసుపత్రిలో సమస్యలు, సౌకర్యాలపై చర్చించారు. ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధులు నిర్వహించడానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొందరు వ్యక్తులు బైక్‌లను పార్క్ చేసి వెళ్తున్నారని దీంతో వచ్చే రోగులకు అంబులెన్సులకు ఆటంకం కల్గుతుందని తెలిపారు. ప్రైవేటు వాహనాలను లోపలికి అనుమతించకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని చైర్‌పర్సన్ కోరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కుతాడి రవీందర్, మాజీ సర్పంచ్ మెబబొయిన వెంకటేశ్, సొసైటీ మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు సల్లూరి నర్సింగ్‌రావు, బొక్క జంగారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.ఎ.ఫారూఖ్, నాయకులు కె.నర్సింగ్‌రావు, సిరాజుద్దిన్, రాజారత్నం, కట్ట సుధాకర్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్‌గా రాజేందర్

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల నాయబ్ తహశీల్దార్‌గా కె.రాజేందర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన నాయబ్ తహశీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ మండల తహశీల్ కార్యాలయంకు బదిలీ చేశారు. ఈమేరకు మల్కాజ్‌గిరి నుంచి కె.రాజేందర్ ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తహశీల్దార్ రజిని కలిసి సిబ్బందితో మాట్లాడి ప్రజలకు మెరుగైన రెవెన్యూ పరమైన సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## యుఎస్ఏలో అంబేద్కర్‌కు మల్లేశ్ నివాళులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో లివింగ్ స్టోన్ రోడ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మీసాల మల్లేశ్ నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను ఘట్‌కేసర్‌కు చెందిన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మల్లేశ్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అమెరికాలోనే అత్యంత ఎతైన అంబేద్కర్ 21 అడుగుల విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లేశ ఆయన సతీమణి మంగమ్మ, సోము ప్రతిభ, విజయ్‌కుమార్‌లు అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. అంబేద్కర్ లాంటి దళితుడుతన ఎదుగుదలకు భారతీయులందరి హక్కులను కాపాడే రాజ్యాంగ ంలోని పదాలను రాయగలడు అని అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా అన్న మాటలను గుర్తు చేశారు.

## గాంధీనగర్‌లో ఇంటితాళం పగులగొట్టి చోరీ

ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త: ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఘట్‌కేసర్ మున్సిపల్ గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ అక్రమ్ తన భార్య పిల్లలతో కలిసి జూలై 31న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ మలక్‌పేట్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పక్కింటికి చెందిన కాంటేకర్ సంధ్య ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో మహ్మద్ అక్రమ్ తన భార్య, పిల్లలతో వచ్చి చూసేసరికి తలుపు తెరచి ఉంది. బెడ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండగా అందులో తన భార్యకు చెందిన రెండు జతల వెండి పట్టగొలుసులు, కూతురుకు చెందిన ఒక జత వెండి పట్టగొలుసులు, ఒక జత వెండి కాళ్ల కడియాలు, కొంత నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకొని పరిశీలించి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సైదులు తెలిపారు.

## ఏయూ విద్యార్థులకు స్పెషల్ జ్యూరీ అవార్డు

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం మెకానికల్ విభాగం విద్యార్థులకు ఇండియా డిజైన్ వీక్ 2024 పోటీల్లో పాల్గొని తయారుచేసిన 'వాటర్ గార్బేజ్ కలెక్టర్' డిజైన్‌కు ప్రత్యేక జ్యూరీ బహుమతి లభించింది. ప్రతిష్టాత్మకంగా పోటీని ఐటీసీ అకాడమీ, ఆటోడెస్క్ కంపెనీ చెన్నైలో జూలై 25, 26 తేదీలలో నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొనడానికి ఈఅవకాశం వచ్చిన ఒకే ఒక ఇంజనీరింగ్ కళాశాల అనురాగ్ యూనివర్సిటీ అవడం ప్రత్యేకమన్నారు. బహుమతి పొందిన విద్యార్థులు ఇ.మహేశ్, కె.శౌశిక, బి.చరణ్‌సన్నీ, ఎండి.సజీద్, మార్గదర్శకుడు డా.జుష్‌కుమార్‌లను మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్‌చలపతితో పాటు ఇతర అధ్యాపకులు అభినందించారు. ఈకార్యక్రమంలో పాల్గొనడానికి అవకాశం కల్పించిన యూనివర్సిటీ యాజమాన్యం, డీన్ ఆఫ్ స్కూల్ ఇంజనీరింగ్ డా.వి.విజయ్‌కుమార్‌లకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమ సమాజ స్థాపనకు గద్దర్ కృషి

**గజ్వేల్, ఆగస్టు 3 (ప్రభాతవార్త):** సమ సమాజ స్థాపన కోసం ప్రజా యుద్ధనౌక గద్దర్ తన జీవితాన్ని త్యాగం చేశారని గద్దర్ ఫౌండేషన్ సభ్యుడు ఆస శ్రీరా ములు పేర్కొన్నారు. శని వారం గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ మాల మహానాడు నాయ కుడు తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సంద ర్భంగా గోడ పత్రికను సీనియర్ జర్నలిస్టు బండారు రాజు, టిపిసిసి రాష్ట్ర నాయకుడు డాక్టర్ గద్దం శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరిం చారు. అనం తరం వారు మాట్లా డుతూ ఈనెల 6న హైద్రాబాద్ రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గద్దర్ యాదిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. మోచి సంఘం రాష్ట్ర కార్యదర్శి వేణు, రాయపోల్ మం డల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు పాల్గొన్నారు.

## అమోఘంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**మునిపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త:** 1983-84లో ఒక చోట విద్యను అందుకుని వివిధ రంగాల్లో స్థిరపడ్డ స్నేహితులు ఆదివారం ఒక చోటుచు చేరుకుని పూర్వ విద్యార్థు ఆత్మీయ సమ్మేళనాన్ని అమోఘంగా ఆనందోత్సవాలతో సదాశివపేట పట్టణంలోని బసవేశ్వర మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసు కుంటూ తీపిగా గుర్తులను నెమరేసుకున్నారు. 2007లో తొలిమారు 20మంది స్నేహితులతో ఓ మారు పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని తుమ్మల పృథ్వీరాజ్ నేతృత్వంలో జరుపుకున్నారు. నాడు ఓ కమిటిని ఏర్పాటు చేసుకుని పూర్వ విద్యార్థుల మిత్ర బృందం-1983-84-ఎస్ఎస్‌సి బ్యాచ్ అని నామకరణం చేసుకున్నారు. శనివారం మరో మారు పూర్వవిద్యార్థుల ఆత్మీమ సమ్మేళనం జరుపుకుని నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం రోజున పాత స్నేహితులందరూ ఆలయంలో పూజలు నిర్వహించి పచ్చడిని స్వీకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.